# జేబుదొంగ

నెల రోజులు చెమటోడ్చి పంజేసిన జీతం డబ్బులు పర్సులోకొచ్చేసాయి. నోట్లతో కడుపుబ్బిపోయిన పర్సు అలవోకగా ఆవులించింది. దాని మూతిమూసేసి పాంటు జేబులో పడేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి. అప్పటిదాకా ఆరేసిన మసిగుడ్డలాగున్న మొహం అరవిరిసిన గులాబీలా వెలిగిపోయింది.

ఉద్యోగ పర్వంలో ప్రవేశించి పదిహేనేళ్లు దాటింది. అంటే... ఇప్పటికి నూట ఎనభైసార్లు జీతం వచ్చింది. కాని.... తిన్న అన్నమే రోజూ తింటున్నా పాత పెళ్లాంతోనే రోజూ సంసారం చేస్తున్నా... ఎప్పటికప్పుడు అదో అనుభూతి. అలాగే నెలనెలా జీతం వస్తున్నా ఆ ఒక్కరోజు అనుభూతే వేరు.

ఏదో శంకుస్థాపన వెపంతో పట్టణానికొచ్చిన మంత్రిగారు తమ అధికార పార్టీ అధికార నభ్యులతోనూ చీలికవర్గం నాయకులతోనూ సంప్రదింపులు జరిపి ఊరు, దాటేసరికి మధ్యాహ్నం పన్నెండైంది. పోలీసు యంత్రాంగం మొత్తం గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది. యస్పీగార్ని పంపించి టూటౌన్ స్టేషన్‌కొచ్చేసరికి ఎండవుండిపోతోంది. పాత స్టేషన్లో కొత్త యన్.ఐలా చిటపటలాడిపోతుంది.

ఫాన్ వేసుకొని సీట్లో కూచోగానే ఒళ్లు చల్లబడింది. హాయిగా ఉంది, ఇంకాస్సేపలాగే ఉంటే నిద్రకూడా రావచ్చు.

పోలీసును చూసి పారిపోయిన తీవ్రవాదిలా కరెంటు మాయమైంది ఇహ ఉండరాదు. స్టేషన్లో ఉంటే లాభంలేదు ఉసూరుమంటూ సైకిలెక్కాడు ఇంటికి చెక్కెయ్యాలనుకున్నాడు. సైకిల్ పరుగెత్తుతూంది బుర్రలో ఏదో మెదుల్తూంది ఒస్టాండ్‌దాకా వచ్చేసరికి షడెన్ బ్రేక్ పడింది. చాయ్ తాగాలన్పించింది

ఇంత బతుకూబతికి ఇంటెన్క చచ్చినట్టు ఇన్నేళ్ళు పోలీస్ డిపార్టుమెంట్‌లో పంజేస్తూ సొంత డబ్బుల్తో చాయ్ తాగాలా! అవమానం కానిస్టేబులెవడన్నా చూసినా లేదా పాత కేడీగాడెవడన్నా మధ్యలో వచ్చినా.. పోలీస్ పరువు పచ్చకర్పూరంలా హరించుకు పోతుంది.

ఆనంద్ భవన్ ముందు సైకిలాగింది. హోటల్లో జనార్ధన్. ఆహా! అపర శిబిచక్రవర్తిలా కన్పించాడు. ప్రాణం లేచొచ్చింది.

"ఏం రా తమ్మీ.... జనార్ధన్.... ఏం సంగతులూ?" పక్కన కూచున్నాడు.

జేబులు కత్తిరించడంలో జగాన్ని జయించిన మేటి కళాకారుడు జనార్ధన్.

"ఏం లేదన్నా.... ఇప్పుడే వచ్చిన. చాయ్ తాగుదామా?" వినమ్రంగా అడిగాడు.

"చాయ్‌నా!...... ఎండలేమో దండిగున్నయ్. గీ ఎండపూట చాయ్ ఏం బాగుంటదీ! కూల్ డ్రింకైతే జర పానం చల్లబడ్తది గదా!

"ఓదాందేముంది .... తాగేద్దామన్నా!"

"అంటే.. ఏదీ తినక ముందే తాగుదామా?"

"ఏం తిందామన్నా.. ఇయ్యాల్ల గిరాకి లేదు. నా మనసు మారిపోతుంది."

"అవన్నీ నాకు జెప్తావా! రానీ.. చికెన్ బిర్యానీ తిందాం తమ్మీ..అరె నెలకొక్కసారన్నా కోడి బిర్యాని తినకపోతే ఏం బతుకురా?"

భుజమ్మీద చెయ్యి చూపులు కళ్లలోకి

జనార్దన్ ఐసైపోయాడు చికెన్ బిర్యానీకి అర్డరిచ్చాడు గట్టిగా కౌగలించుకున్నాడో సారి ఆవురావురుమంటూ తినేశారు

కూల్‌డ్రింక్ కార్డరైంది

"ఏంరా జన్నూ! ఈ నడుమ కన్పిస్తనేలేవు ఊర్లో లేవా?" వీపు నిమిరాడు

ఓ నిమిషందాకా జవాబు రాలేదు జనార్ధన్ మొహం అదోలాగైంది

"ఏమైంది తమ్మీ! వేరే ఊర్లో జేబుగొట్టి జైలుకుపోయొచ్చినవా?"

"కాదన్నా....."

"మరేమైంది తమ్మీ?"

"ఈ సిద్ధిపేటకూ నాకూ రుణం తీరిపోయిందన్నా!'

షాక్ తగిలినట్టుయింది వెంకటస్వామికి.

"ఏం రా.... ఎందుకూ?"

"ఏం లేదన్నా మొన్న మా ఊరి నుండి వచ్చిన కొన్ని రోజులక్కడనే ఉన్న."

"గా పల్లెటూర్ల జేబులుగొడ్తే.. ఇంగ నువు బతికినట్టే .... మమ్మల్ని బతికించినట్టే."

"అది కాదన్నా . నాకు పెండ్లి ఖాయమైంది. జేబులు గొడ్తలేను. పెండ్లిజేసుకొని కట్నం డబ్బుల్తోని ఏదాన్నా యాపారం జేస్కుంటా."

అసలు షాకు ఇప్పుడు తగిలింది.

"అరే... గట్లంటే ఎట్లరా? నువ్వు లేకుంటే మా గతేందటా? మా ఆదాయం పడిపోతదిరా అసలూ .. జేబులు గొట్టడంలో నిన్ను మించిన మొనగాడు మా టూటౌన్ ఏరియాలనే కాదుగదా హోల్‌మొత్తం మన జిల్లాలోనే ఎవడూలేడు తెల్సా! నీ గురించి మేము చాలాసార్లు మాట్లాడుకుంటుంటాం."

"గిట్ల .:. దొంగ బతుకింకెన్నేండ్లన్నా? రోజంతా బస్టాండ్ల బేజులుగొట్టాలె రాత్రికి మీకు సగం పంచియ్యాలె. దొరికిపోతే పబ్లిక్ మా పక్క బొక్కలిరగ్గొడ్తరు మిగిలిన బొక్కలు మీ లాఠీ దెబ్బలకిరిగిపోతే. గిట్ల మా జేబుదొంగల బతుకు తెల్లారిపోతది. ముసలితనంలో ఎవ్వడూ దగ్గరికి రానియ్యడు బిచ్చమెత్తుకోవాలే"

"అరె.... పూర్తిగా మారిపోతున్నావురా!"

"ఔనన్నా.... మారిపోయిన. దొంగబతుకు నాకొద్దిహ. ఇది నేను నీకు తాగించే ఆఖరి కూల్‌డ్రింక్ బాస్."

ఇద్దరూ కూల్‌డ్రింక్స్ లాగిస్తున్నారు.

"అరెరే .... బంగారుమసుంటి దొంగబుద్ధి బజార్ల పారేసుకున్నావా? గట్ల నిర్ణయించుకున్నవేందిరా?"

"ఔనన్నా! ఇగో.... బ్యాగుతోనహా వచ్చిన. ఇక్కణ్ణుంచి బస్కెక్కిపోతా." కాళ్లవద్దనున్న ఎయిర్ బ్యాగ్‌ను కళ్లతో చూపించాడు."

"మీరు నాకెంతో సాయం జేసిన్రన్నా. ఎన్నిసార్లు పట్టుబడ్డా కన్నతండ్రోలె... అందరి ముంగిట కొట్టి చాటుకు విడిపించిండ్రు. మీ సాయం ఈ జన్మలో మరువలేనన్నా!"

జనార్ధన్ కళ్లల్లో నీళ్లు దిరిగినై. చలించిపోయాడు వెంకటస్వామి, కడుపులో దేవినట్టైంది.

"పొద్దుగాలలేచి ఎవల మొఖం జూచిన్నో... నాకిద్ది చెడ్డ వార్తరా?" అంటూ ఎందుకైనా మందిదని పాంటు జేబు తడిమి చూసుకున్నాడు. పర్స్ భద్రంగా ఉంది. బరువెక్కిన గుండెల్తో బయటికొస్తుంటే జనార్ధన్‌ను గుండెలకు హత్తుకోవాలన్పించిది. కాని బాగన్పించలేదు.

ఇరవై రూపాయల నోటు వెంకటస్వామి చేతిలోపెట్టి సమస్కరించాడు జనార్ధన్.

"ఇంగ వస్తనన్నా!"

"సరేరా... సల్లగా బతుకు తమ్మీ!" అంటూ మరోసారి జేబు తడుముకున్నాడు. పర్స్ క్షేమంగా ఉంది.

ఇంటికెళ్లగానే ఇల్లాలు ఎదురొచ్చింది చిరునవ్వులు చిందిస్తూ కొత్త పెళ్లి కొడుకులా సిగ్గులు మేళవించి "ఇగో . ఇది నానెల జీతం తీస్కో పైజలు జెర జాగ్రత్తగా ఖర్చుపెట్టు" పర్సు అందించి డ్రెస్సు మార్చుకుంటున్నాడు వికలమైన మనస్సులో జనార్ధన్ మెదుల్తున్నాడు

పర్సు చేతికి రాగానే ఇల్లాలి మొహం ఇందీవరములా విచ్చుకుంది పర్సు విప్పగానే అరిపోయిన హారతి పళ్లెమైపోయింది వెంకటస్వామికి వెర్రి లేదుగదా!

"ఇదేందయ్యా. ఖాళీ పర్సు మజాక్ చేస్తున్నావా? రుసరుసలాడ్తూ పర్సు విసిరేసింది.

హెడ్‌కానిస్టేబల్ హెడ్డులో కోడిగుడ్డు దొర్లింది.

"అరె... ఇది నా పర్సుకాదు గిది నాజేబులకెట్లొచ్చిందబ్బా! మరి నా పర్సేమైందీ?" ఆందోళనగా పర్సునటూ ఇటూ తిప్పిచూశాడు.

"ఎవడో మాయంజేసిండు, చేసేది పోలీస్ నౌకరీ చూసేది వైసుపోరీలను జూస్తే వంకరదిరిగిపోతివి కాలేజిపోరి కన్పిస్తే కంట్లో కారంగొట్టినట్టాయె కాలు కదలదాయె." భార్య ధుమధుమలు. పుండు మీద పచ్చికారం పూసినట్లైంది కాని ఏం చేయ్యాలి?

"హారి నా కొడుకా... జనార్ధనా .. ఎంత పంజేస్తివిరా. . ఎంత నాటకమాడ్తివిరా! .. ఇంతకీ నీదే ఊరురా !" గొణిగాడు మింగలేక కక్కలేక సతమతమై . గుడ్లు మిటకరిస్తున్నాడు

(ఆదివారం - ఆంధ్రభూమి- 29-10-1995)

